


# గుడి తన్నిన బడి అను పాము కథ

ఉదయ కిరణాలు చలిని చీల్చుకుని ప్రెసిడెంటుగారి చెరువుగట్టు తాటి తోపుల్లోంచి ధారగా దిగి, చెరువుమీద నులివెచ్చగా పరుచుకుంటున్నాయి. కలవాడి కంబళి ఎల్లలు దాటి ఎలానూ ప్రవేశించలేని చలి లేనివాణ్ని నిలువెత్తునా ఆక్రమించుకుని రాత్రంతా చర్మాన్ని పీకి, ఎముకల్ని కొరికి వాళ్లతో ఇట్టే పొద్దు పొడిచీ పొడవకముందే బయటపడి చలిమంటల్లోనూ, ఆ తర్వాత సూర్యుడి నులివెచ్చని లేత కిరణాల్లోనూ కరిగి పల్చబడిపోతోంది. ఊరింకా మేలుకున్నట్లు లేదు. గూడెంలోని జీవాలుమాత్రం గుడిసెలు వదిలి చాలాసేపవుతోంది. అందుకు నిదర్శనంగా ప్రెసిడెంటుగారి చెరువుప్రక్క తోటలో అరక నడుస్తోంది. శ్రామిక జీవనానికి ప్రతిబింబాలుగా తాటిచెట్ల ఆకుల్ని వేళ్ళాడుతోన్న గూళ్ళలోంచి పిచ్చికలు గోలగా పొలాలమీదికి ఎగిరిపోతున్నాయి.

పక్కి తోటలో శీతాకాలం దుక్కి దున్నుతున్న ప్రెసిడెంటు గారి పాలేరు రామన్న పగిలిన కాలికి దుక్కబెడ్డలు గుచ్చుకుంటుంటే 'అమ్మా' అని క్షణం అరక ఆపి, చెప్పులు సరిచేసుకుని అంతకంటె గత్యంతరం లేదు గనుక మళ్ళీ మేడు పట్టుకుని ఎడ్లను అదిలించాడు. అవి చురుగ్గా ముందుకు సాగేక మధ్యలో ఆపేసిన పాండవ విజయా ల్లోని పద్యాన్ని అందుకుని వాటి వెనకే మేడు పట్టుకొని నడుస్తున్నాడు.

మతం ప్రసాదించిన ఆచారం ఆయవారం కోసమైనా తప్పదు గనుక అంత చలిలోనూ చెరువుకి స్నానానికి బయల్దేరాడు ఆచార్యులు గారు. పోతూ పోతూ అరక దున్నుతున్న రామన్నని క్షణం సేపు చూసి.

'ఒరే రామన్నా : ఇవాళ దింపు తీస్తే నాలుగు పట్టలు అలా ఇంట్లో పారెయ్యటం మర్చిపోకు సుమా !' అని ముందుకి సాగిపో యాడు. అంతకంటె ఎక్కువ మాట్లాడే తీరిక లేదాయె. అవతల సంధ్యా వందనానికి సమయం మించిపోతోంది. ఇంకా స్త ముందు బయల్దేరేవాడే. వెధవది ఆ పాము భయం ఒకటి. కొంపతీసి చీకట్లో ఎ తోకో తొక్కాడంటే ఇంకేముంది. కసిక్కున కాటేస్తుంది. దిక్కు లేనితన భార్య కుక్కచావు చస్తుంది.

రెండు రాత్రులనుంచీ నిద్రలేదు. దానికితోడు ఆవిడగారి నసుగు డొకటి. తాము కాపురం వుంటున్న ప్రెసిడెంటుగారి తోటని బడికి దానం చేశారుట. అప్పుడే భవనాలు కట్టేందుకు సన్నాహాలు జోరుగానే సాగుతున్నాయి. 'ఏదో ఒకటి చెయ్యకపోతే ఎట్లాగండీ' అంటుంది భార్య. ఏం చేస్తాడు ? యాచనచేసి ఏదో పొట్టకోసం అయితే నాలుగు గింజలు తెచ్చుకోగలుగుతున్నాడుగాని, ఉండటానికి ఇల్లెక్కడ తేగ లడు ? ఏదో ప్రెసిడెంటుగారి పుణ్యమాని ఇంతకాలం ఆ పాకలో

కమ్మగా బతికిపోయారు. ఇప్పుడది వదిలి పోవాలంటే కష్టంగానే వుంది. అయినా తప్పుతుందా ? ఈ మధ్య తప్పే అవకాశాలు వున్నట్టు కూడా వింటున్నాడు. కాని అవన్నీ తనకు సాగేవా ? సాధ్యపడేవా ? బ్రాహ్మడికి బుద్ధిబలం అయితే వుంటిగాని భుజబలం ఎక్కడిది ? ఇన్నేళ్ళనుంచీ అక్కడ కాపురం వుంటున్నాడు కదా ? తన స్వంత భూమిలాగే కూరగాయలు వగైరా పండించుకుని సుష్టుగా భోంచేస్తున్నాడు గదా ! ఒకపక్క 'పేదవాళ్ళకి భూములు' అని ప్రభుత్వం అంటుండగనే తన్ను తరిమేసే ప్రయత్నం ఎంత ఘోరం ? అవతల మునసబుగారి తోటలో కూలాళ్లు లేరూ ? వాళ్లనెవడు లేపాడు ! 'అరటి తోట వెయ్యాలి అక్కణ్ణుంచి లేచిపొండి' అంటే లేచారా ? దున్నేవాడిదే భూమట ! అలాగే వుండేవాడిదే స్థలం కాబోలు !! తలో కత్తి, కర్రా పట్టుకుని ఆ వెళ్ళినవాళ్ళమీద పడబోతే ఎక్కడివాళ్ళక్కడ చెల్లాచెదురై పోయారు. ఆ తర్వాత వాళ్ళని లేపమని అడిగినవాడూ లేడు, లేపినవాడూ లేడు. మరి తనో ? మంది బలం తన కెక్కడిది? అవసరం అయితే తనవాళ్లు తలోరాయీ తనమీదే వేస్తారు తప్ప తనకు సాయంగా అవతలి వాడిమీద వెయ్యరు. అలా అయితే ఇక్కడ ప్రెసిడెంటు పాకలో పడుండాల్సిన ఖర్మం పట్టింది ? పొమ్మంటే ఇంతగా వాపోవాల్సిన అవసరం ఏం వచ్చింది ? వెధవది 'పిదప కాలం' అనుకున్నాడు ఆచార్యులుగారు.

చెరువు గట్టెక్కాక నడుస్తూ నడుస్తున్న కాళ్లు అసంకల్పితంగా అలాగే ఆగిపోయాయి కళ్లు మాత్రం కాస్త దిగి నిన్నటి స్థలంలో భయం భయంగా వెతికాయి. ఆశ్చర్యం !! నిన్నటిలాగే ఆ పాము సూర్య నమస్కారాలు చేస్తోంది. ఎంత పెద్ద పాము. నీరెండలో బంగారం వన్నెతో మెరిసిపోతోంది. వాయువేగంతో వెనక్క పరుగెత్తి రామన్నని లాక్కొచ్చారు ఆచార్యులుగారు. వాడు కర్ర తీసుకొని

'ఉండు పంతులుగారూ ఒక్క దెబ్బతో సంపెత్తా' అంటూ బిగబో యాడు. వాణ్ని ఆపి-

'ఓరి వెంగళప్పా! ఇదేం అల్లాటప్పా పాపనుకున్నావటా? చంపటానికి! ఆదిశేషువు అవతారం. సాక్షాత్తూ కాలకంఠుని మెడ లోంచి జారి పడిన పాముర! పూర్వ జన్మపు వాసనలు పోక ఇంకా జపతపాలు చేస్తోంది.'

అంటూ ఆ నిరక్షర కుక్షిముందు పాము ప్రశంస చేశాడు. ఎప్పుడూ ఇలాంటివాళ్ళు చెప్పటమూ తాము వినటమేగాని వేరు అన వాయితీ ఆలోచన ఎరగని రామన్న ఆ క్షణాన ఆచార్యులుగారు చెప్పిన వన్నీ వినక తప్పలేదు. ఆచార్యులుగారి ఉపన్యాసం అయ్యాక ఆయన చెప్పినట్లే ప్రెసిడెంటుగార్ని పిల్చుకు రావడానికి పరుగెత్తాడు. ప్రెసి డెంటుగారు పుల్ల నోట వుండగానే ఆదరా బాదరా పరుగెత్తుకొచ్చేప్పటికే ఆ భాగవతస్వామి తన పని కాస్తా ముగించుకుని చల్లగా జారుకుంది.

'ఏది పంతులూ ఎక్కడ?'

'ఇంకా ఎక్కడిదండీ! మీరు నోట్లో పుల్ల పెట్టుకుని చక్కా వస్తే అది అగపడుతుందటండీ. దైవం అశుచి నయిస్తుందా?'

'ఎమయ్యోవ్! బాపనయ్యా!! నేనింకా పుల్లయినా పెట్టు కున్నాను. నువ్వింకా అదీ లేదుగా' అని ఎదురు దెబ్బతీశాడు ప్రెసి డెంటుగారు. ఆ మాటనుంచి మెల్లగా తప్పించి ఆ మర్నాడు గ్రామ పెద్దలంతా ఆ సోద్యం చూసే ఏర్పాటుకు ఒప్పించాడు. ఇక ఆ చెరు వులో స్నానం చేసే ధైర్యం చాలక అక్కడే ఎక్కడో నాలుగు చేదలు మాత్రి నీళ్ల నెత్తిన పోసుకుని ఇంటికి వెళ్ళేటప్పటికి మళ్ళీ మొదలు.

'ఏవండీ, చూడండీ! ఆ కరివేపాకు మొక్క చూడండి ఎంత

ఎటిగిందో, అలా చూడండి ఆ పాదులు ఎన్ని పిందెలు టిగాయో, ఇవన్నీ ఒటిలి ఎట్టాగండీ పోయేది?

'అమ్మ కడుపుగాల కాస్త ఆగవే. నన్ను ఆలోచించనీ' అంటూ కాస్త మెడ వంచి లోపలి కెళ్ళిపోయాడు.

○ ○ ○

పేరు సత్యన్నారాయణ అయినా ఆ వూళ్ళో అందరూ ఆయన్ని సత్యం మాష్టారుగానే ఎరుగుదురు. ఆయనిది ఏ వూరో, ఎక్కడ్నుంచి వచ్చాడో ఎవరికీ తెలీదు. కారణ జన్మడంటారే, అలాగే కారణాగమం చేసినట్లు ఆ ఊళ్ళో అడుగు పెట్టిన నాటినుండీ ఏదో మంచి పని చేస్తూనే వున్నాడు. ముందుగా మురికివాడలో మకాం పెట్టి ఎలా శుభ్రంగా వుండాలో నేర్పాడు. ఆ తర్వాత పదిమంది పిల్లల్ని పోగేసి పాఠాలు చెప్పటం మొదలెట్టాడు. అది ఒక పాఠశాలగా రూపొందాక, చదువుమీద అంతగా ఆసక్తి లేని ఆ వూరి పెద్దలచేత పాఠశాలకి భవనాలు కట్టించేందుకు ఒప్పించాడు. గ్రామాన్ని ఎట్లా బాగుచెయ్యాలో ప్రెసిడెంటుగారికి సలహా లిస్తుంటాడు. అవి ఆయన కంతగా రుచించకపోయినా అతని బుద్ధి కుశలతకు సమ్మోహితుడై, అతన్ని వదల్లేక కనీసం వచ్చే ఎన్నికలవరకైనా అతని మేధస్సుని వాడుకోవాలని తన ఆంతరంగికుడుగా చేసుకున్నాడు. ప్రెసిడెంటుగారి మానవత్వాన్నీ, మూఢ విశ్వాసాన్నీ తెగనరికే సత్యం మాష్టారు పాము వార్త విని నవ్వుకున్నాడు. అయినా ప్రెసిడెంటుగారి అభ్యర్థనపైన వెళ్ళక తప్పింది కాదు.

అంతా గప్‌చుప్‌గా చెరువు గట్టున నుంచున్నారు. ఆచార్యులుగారు ఆరోజు కాస్త ముందుగానే స్నానంచేసి సమయోచితమైన వేషధారణ చేసి మరీ వచ్చారు.

పొద్దు పొడిచింది. తాటిచెట్ల మధ్యనుంచి ఎండపొడ పాయలుగా చెరువు మీదికి వాలుతోంది. రోజులాగే పాము సమయానికి వచ్చింది. చెరువులోనికి దిగి, రెండుసార్లు తల నీటిమీదికి వాల్చి, ఒడ్డుకు చేరి ఎండవైపు పడగ సారించి అయిదు నిముషాల తర్వాత వెళ్ళిపోయింది.

'చూశారా ? ఇప్పుడైనా నమ్ముతారా ?' అంటూ మొదలెట్టాడు ఆచార్యులుగారు.

'కళ్ళతో చూశాక కూడ నమ్మకుండా ఎట్టా గుంటామయ్యా ?' అన్నాడు మునసబు.

'మీరేమంటారు సత్యం మాష్టారూ ?' అనడిగారు ప్రెసిడెంటుగారు.

'నా అభిప్రాయాల కేముంది ? మీరు చూశారు గదా ? ఏమనుకుంటున్నారో చెప్పండి.'

'ఆయనమాత్రం ఏమంటాడండీ ? పాము చెరువులో స్నానం చెయ్యటం, సూర్య నమస్కారాలు చెయ్యటం ... ఇవన్నీ సామాన్య విషయాలా ?'

'అది స్నానమూ గాదు-దానికి భక్తీ లేదు.'

'మీ రేమంటారు ?'

'భుక్తి కోసం మాత్రమే. ఇది అక్కడే ఎక్కడో కలుగులో వుంటుంది. ముసలి పాముగదా దృష్టికూడా సరిగా లేకపోవచ్చు. కప్పలకోసం బయల్దేరి కన్పించక నీటిలో కెళుతుంది మొదట. అది నీరని తెలిశాక మళ్ళీ వెనక్కెళ్ళిపోతోంది.'

'మరి ఆ సూర్య నమస్కారాలు ?'

'ఏముంది ? తల తడిసింది గదా. ఎండకి కాస్త ఒళ్ల కాచు కుంటోంది.

'మరీ విపరీతంగా వుంది మీ భాష్యం'.

'అందుకే ముందే చెప్పాను. నా అభిప్రాయాలు మీకు నచ్చవని.'

'ఎంత చదువుకుంటే మాత్రం మరీ అంత....'

'అది సరే లేవయ్యా ! ఆయన అభిప్రాయం ఆయన చెప్పాడు. ఇప్పుడేం చెయ్యాలో నువు చెప్పరాదూ' అంటూ సమర్ధించాడు ప్రెసిడెంటుగారు. నిజానికి ఏం చెయ్యాలనేది ఆయన ఇదివరకే ఆలోచించి పెట్టుకున్నాడు. నల్లమందులాంటి మతాన్నీ, మూఢ విశ్వాసాలనీ ఎలా స్వప్రయోజనాలకి వాడుకోవాలో ఆయనకి బాగా తెలుసు. అందు లోనూ ఎలక్షన్లు సమీపిస్తున్నవాయె !

'ఇంకేవిట చేసేది. గుడి కట్టించటమే' అనేశారు మునసబు.

అటుపైన ఎక్కడనేదాకా వచ్చేసి తెగక ఇళ్ళ కెళ్ళిపోయారు. అది కనబడ్డచోటునే కట్టాలంటే చెరువులోనే కట్టాలాయె మరి !

o o o

'తమరు స్కూలు కట్టించే ప్రయత్నాలు వెనక్కి నెట్టేశారు' అన్నాడు సత్యం మాష్టారు ప్రెసిడెంటుగారితో.

'కొద్దిరోజులు లాగండి మేష్టారూ. ఈ హడావుడి కాస్త చల్లబడ నీండి. రేపు షష్ఠికి పెద్ద ఎత్తున ఉత్సవాలు జరపాలనే ప్రయత్నంలో వున్నాం. జనం ఎలా విరగబడుతున్నారో చూస్తున్నారుగా !'

'చూస్తున్నానండీ. అజ్ఞానం ఎంత త్వరగా విస్తరిస్తుందో చూస్తూనే వున్నాను. ఈ చాదస్తం పేపర్లదాకా పాకిపోయింది.'

'అది చాదస్త మనకండి. దేముడు కాకపోతే అంత సిష్ట మేటిక్‌గా సాధన చేస్తుందటండీ పాము.'

'ఆకలి తీరటం ఒకటే దాని ఇష్టం. ఆమాటకొస్తే ఆచార్యులు గారితో సహా మనందరిదీ ఒకటే ఇష్టం. పోతే వాటి తీరుతెన్నులు వేరు. పాపం దానికి దృష్టీ, స్పర్శజ్ఞానం పోయి వుంటాయి. మీరు ఫోటోలు తీసినా సంబరాలు చేసినా ఊరుకుంటోంది.'

'అంత తీసి పారెయ్యకండి. ఎంత చదువుకున్నా కొంత దైవ భక్తి కూడా అవసరం'.

'ఏమో నాకట్లా అనిపించటంలేదు. ఎందుకంటారా? ఈ ఊళ్ళో ఇంతమంది పేదవాళ్ళున్నారు. వాళ్ళకి రెండుపూటలా తిండీ, చలిలో కప్పుకోడానికి కాస్త గుడ్డా వుండేట్టు చూడండి. ఇంతమంది పిల్లలున్నారు. రేపు దేశాన్ని బాగుచెయ్యాల్సిన వాళ్లు వీళ్లే. వీళ్ళకి కాస్త అక్షరజ్ఞానం కలిగించండి అదే ప్రస్తుత అవసరం. అంతేగాని ఆ పాముని దేవుడని అందరితోపాటు మీరూ అనుకోవడం నాకేం నచ్చలేదు'.

'అదీ చేస్తున్నాంగా!'

'ఏం చేస్తున్నారు. అంతా ఆ చాందసంలో పడి కొట్టుకుపోతూ వుంటే!'

'ఇదిగో మాష్టారూ! నేను ప్రజల మనిషిని. ప్రజలు ఏం కావాలంటే అది చెయ్యటమే నా పని.'

'ప్రజలు విషం కావాలంటారు. ఇస్తారా?'

'ఇది విషం కాదుగా?'

'అంతకంటే ఘోరం. ఇలాంటి మూఢ విశ్వాసాలు మప్పి ప్రజల్ని మరింత అంధకారంలోకి నెట్టేస్తున్నారు. మీరే గొప్పవాళ్ళని నమ్మే ఈ అమాయకులకి మిమ్మల్ని అనుసరించటం కంటె ఏవిటి గత్యంతరం?'

'సరేనయ్యా! నువు చెప్పినట్లే చేస్తాను. ఇది వట్టి మూర్ఖత్వం గుడి కట్టించనని చెప్పేస్తాను. స్కూలు కట్టే ఏర్పాట్లు చేస్తాను: పేద వాళ్ళకి నేను చేయగలినంత సాయమూ చేస్తాను. రేపు వచ్చే ఎన్నికల తర్వాత నే నే ప్రెసిడెంటునవుతానని హామీ ఇస్తారా?'

'నేనిచ్చేదేమిటండీ ప్రజలకి మీరు కావాలనుకుంటే తప్పక ఎన్నుకుంటారు.'

వీళ్ళకి కావాల్సిందేమిటో వీళ్ళకి తెలుసంటారా?'

'అయినా మీరో మంచి పనిచేస్తున్నప్పు డివన్నీ ఆలోచించ కూడదు.'

'ఇవన్నీ లేకపోతే అసలు మంచి పని చెయ్యాల్సిన అవసరం ఏముంది, నాకు.'

సత్యం మాష్టారుకు తల తిరిగింది.

'అయితే గుడే కట్టిస్తామంటారు.'

'పోయినసారి వంతెన కట్టిస్తానని ప్రెసిడెంటయ్యాను. ఏవో కొన్ని ఇబ్బందులు వల్ల కట్టించలేకపోయాననుకోండి. దాన్నిసాకుగా తీసుకుని మునసబు ప్రెసిడెంటవాలని గుంటనక్కలా కాచుక్కూర్చు న్నాడు. వాడికా అవకాశం ఎందుకివ్వాలి? గుడికట్టిస్తాను ప్రజలు నన్నే ఎన్నుకుంటారు. ఆ తర్వాత బడీ, వంతెన ... రెండూ కట్టి స్తాను' అని తన స్కీమంతా బయటపెట్టాడు.

ఇంతలో ఆచార్యులుగారు మునసబు కరణాలను వెంటబెట్టుకుని చక్కా వచ్చాడు,

'కొంపలంటుకుపోతున్నాయి ప్రెసిడెంటుగారూ'

'ఎవరివి? నీవా? నావా?'

'అందరివీను'

'సరిగా చెప్పవయ్యా పంతులూ' అని కసిరాడు మునసబు.

ఆచార్యులుగారు క్షణం సత్యంగారి వంక సందేహాస్పదంగా చూసి–

'అయ్యా! రాత్రి నాకు దేవుడు కల్లో కనిపించాడు. రేపు సుబ్బారాయుడి షష్టినాటికి నాయింటికి ఉత్తరాన గుడి కట్టించి ప్రతిష్టించకపోతే ఊరునాశనం చేసేస్తానన్నాడు. తర్వాత మీ యిష్టం మరి!'

'ఎక్కడ? నీ యింటికి ఉత్తరాన అంటే మా తోటలోనన్న మాట!'

'అవునండీ....'

'అది స్కూలు కిచ్చేశాంగా'

'స్కూలు మాట తర్వాత చూడొచ్చు. ముందీ ఆపద గట్టెక్కే ప్రయత్నం చెయ్యండి.'

'ప్రెసిడెంటు గారూ! మీరీ మాయలో పడిఊరికి అపకారం తలపెట్టకండి. స్కూలు కట్టే ప్రయత్నాలు విరమించకండి.'

ఆఖరి అభ్యర్థన చేశాడు సత్యం మాష్టారు.

'ఏవిటయ్యా నీ స్కూలూ నువ్వూను. అవతల దేవుడు ప్రత్యక్షమై గుడికావాలని గోలపెడుతూ వుంటే, స్కూలట! స్కూలు!; ఎక్కణ్నుంచి ఊడిపడ్డావయ్యా ఊరిని ఉద్ధరించటానికి. ఊరి వారికి లేని దురద నీకెందుకట!'

'ఆచార్యులు గారూ! మీ స్వార్థం కోసం ఈ వూరి భవిష్యత్తును బలి పెట్టకండి.'

'నువ్వా బలిపెడుతున్నది. గుడి కట్టకపోతే, రేపు వూరు నాశనమైతే నువ్వుద్దరిస్తావా?'

'అసలు మీకు కల రావటం నిజమైతే గనా ఊరు నాశనం కావటం'

'చూశారా ఇతని ధోరణి ?'

'అవునయ్యా, అందుకు రూఢి ఏమిటి ?'

'మీకు రూఢి కావాలా ? అయితే పదండి. నా యింటికి ఉత్తరావయాబై గజాల దూరంలో విగ్రహం వుంది అక్కడే గుడి కట్టించమని చెప్పాడు దేవుడు. తవ్వించండి. విగ్రహం లేకపోతే నేను ఊరొదిలి వెళ్ళిపోతాను. ఉంటే అతను వెళ్ళిపోతాడా ?'

'అదంతా తర్వాత ఆలోచిద్దాంలే పంతులూ.'

*  *  *

ఆచార్యులవారి కల సంగతి వాడవాడలా పాకిపోయింది. అప్పటికే పాముకి పబ్లిసిటీ బాగా పెరిగి జనం తండోపతండాలుగా వస్తున్నారు. దానికితోడు ఈ వార్త హైలైట్‌గా తయారయింది.

తవ్వకంనాడు ఊరి ప్రజలంతా హాజరు కావాలని దండోరా వేయించారు. ఊరివారేగాక పొరుగూరివారుకూడా వింత చూడ్డానికి హాజరయారు.

అందరి సమక్షంలో.... ఆచార్యులుగారి పర్యవేక్షణలో తవ్వకం ప్రారంభమైంది. రెండడుగులు లోతు తవ్వగానే విగ్రహం ప్రత్యక్షమైంది. ఇక ఆచార్యులుగారి అతిశయానికి అంతులేదు. ఆ దెబ్బతో వారు పరమ భక్తాగ్రేసరుడుగా స్థిరపడిపోయారు.

'ఇప్పుడేమంటారు ప్రెసిడెంటుగారూ ?' సవాలు చేశారు ఆచార్యులు గారు.

'ఇంక అనేదేవిటయ్యా, వెంటనే గుడి కట్టించాలి. చందాలు వసూలు చేద్దాం.'

అంత మందిలోనూ ఆ తోట స్థలం యావత్తూ గుడికి దానం చేస్తున్నట్టు ప్రకటించారు ప్రెసిడెంటుగారు. ప్రజలంతా వారికి జేజేలు పలికారు। అక్కడికక్కడే వేలమీద చందాలు వాగ్దానాలు వచ్చాయి. స్త్రీలు బంగారు గాజులూ, గొలుసులూ ఉదారంగా దానం చేసి తమ భక్తిని ప్రకటించుకున్నారు.

* * *

ప్రెసిడెంటుగారు దానం చేసిన భూమితోబాటు దేవస్థానం, దానికి కొంత స్థిరాస్తి ఏర్పర్చింది. దానికి ట్రస్టీగా జీవితాంతం వారే వుండే ఏర్పాటయింది. అర్చకులుగా ఆచార్యులవారి వంశం పరంపరగావుండే నిర్ణయం జరిగింది.

గుడితోబాటే అదే ప్రాంగణంలో ఆచార్యులవారికో మంచి బంగ్లా వెలిసింది.

అనుకున్న ఆ షష్టిరోజు రానే వచ్చింది. ఉత్సవ ప్రయత్నాలు బ్రహ్మాండంగా జరిగాయి. పెద్ద తిరునాళ్ళ ఏర్పాటయింది.

ముహూర్తం ప్రకారం పాముని పట్టుకెళ్ళి గుళ్ళో ప్రతిష్ఠించాలి. ఇది చూడటానికి ఒకరోజు ముందునుండే జనం పొరుగూళ్ళ నుంచి రాసాగారు.

పాముని ఎవరు పట్టుకోవాలన్నది సమస్య. ఆచార్యులుగారు అర్చకులు కాబట్టి వారే పట్టుకుని ప్రతిష్ఠించాలన్నారు.

'అబ్బే! ఆ పని నేన్చేస్తే ఎట్లా? నేను శాస్త్రయుక్తంగా మంత్రాలు చదువుతూవుంటే భజనలతో నా వెనకాల తీసుకురావాలి' అని తప్పించుకున్నాడు ఆచార్యులుగారు.

ఇకపోతే అంత ధైర్యంగా పాముని పట్టుకోగలవాడు ప్రెసిడెంటుగారి పాలేరు రామన్న. వాడు పుట్టలో పామునైనా తోకుచ్చుకు లాగేసి చంపెయ్యగలడట!

'ఈ పని నీ కప్పచెప్తున్నానోయ్ రామన్నా' అన్నారు ప్రెసిడెంటుగారు.

'దానికేముంది లెండి బాబయ్యా. దేముడి పని. అలాగే సేత్తా.'

అన్నాడేగాని రామన్నకి లోపల భయం పీకుతూనే వుంది. పాముని చంపటం వేరు. బతికుండగా పట్టుకుని వెళ్ళడం వేరు దానికి తోడు ఆ ముందురోజే సత్యం మాష్టారు చెప్పనే చెప్పారు.

'పాముని పట్టుకునే పని నీ కప్పజెప్పాలనుకుంటున్నారు రాముడూ. ఒప్పుకోకు. అది విషప్పురుగు. కాటేసిందంటే అనవసరంగా చచ్చిపోతావు' అని.

○ ○ ○

ఊళ్ళోనుంచీ భజన సమూజాలొచ్చాయి. రాత్రంతా చెవులు పగిలేట్టు భజనలు సాగుతుండగనే ఉక్కున తెల్లవారి పొద్దు పొడిచింది. ఎండ చెరువుమీద వాలగనే పాము బయటి కొచ్చింది. యధాప్రకారప్పు నీళ్ళ వరకూ వెళ్ళి, మళ్ళీ వెనక్కి తిరిగి ఎండవైపు పడగవిప్పి నుంచున్నది.

ఆచార్యులుగారు ఏవో శ్లోకాలు చదువుతూ—

'ఊ— కానియ్యరా రామన్నా—' అన్నారు.

రామన్న భయంభయంగానే పాముకి దణ్ణం పెట్టుకుని పట్టుకో డానికి తల వైపు ఒక చెయ్యీ, తోకవైపు ఒక చెయ్యీ చాచి పట్టుకునే ప్రయత్నంలో వున్నాడు. తలా తోకా ఒక్కసారే పట్టుకోవాలనేది వాడి ప్రయత్నం. కాని దురదృష్టవశాత్తూ తోకమీద చేయి ముందు పడింది. పాము కస్సుమని ఎడంచెయ్యి పట్టుకుంది. రామన్న తోక వదిలేశాడు. అది మెలితిరిగి ఉన్న విషాన్నంతా అతని నరాల్లోకి ఒంపేసి దాని దారిన అది పోయింది.

రామన్నని పాము కరవగానే ఎక్కడివాళ్ళక్కడ చెల్లాచెదురై పోయారు. ఆచార్యులుగా రెటుపోయారో అసలు అంతేలేదు. ఇక పాము సంగతి పట్టించుకునేవాళ్ళెవరు !?

రామన్నకి చెయి బరువెక్కుతోంది.

ఓ పది నిమిషాల తర్వాత అంతా చేరుకున్నారు.

'ఏంటయ్యా పంతులూ ఇట్లా జరిగింది?' అనడిగారు ప్రెసిడెంటుగారు.

'ఏముందండీ—' అని రామన్నవైపు తిరిగి

'ఒరే రామన్నా నువు స్నానంచేసి పూజ చేసుకొచ్చావా?' అనడిగాడు.

'లేదండయ్యా' అన్నాడు నీరసంగా.

'చూశారా? అందుకే అట్లా జరిగింది.

ఈ వార్త తెలిసినట్టుంది. జనాన్ని తోసుకుని సత్యం మాష్టారు ముందుకు వచ్చారు.

'అతను చచ్చిపోతూవుంటే అలా చూస్తారేమండీ. పట్టండి హాస్పిటల్ కి తీసికెళదాం'.

'పాము కరిస్తే హాస్పిటలేమిటండీ మంత్రం వేయించాలి గాని'.

'అయ్యో! ఇదేం అపచారం మంత్రం వేయిస్తారా? అదేం మామూలు పామా? దేవుడుపాము' అన్నారెవరో జనంలోంచి.

'అవును. ఇది దైవాజ్ఞ. ఏమీ చెయ్యటానికి వీల్లేదు. మళ్ళీ దేవుడే వచ్చి విషాన్ని తీసేసుకుంటాడు' అని వత్తాసు పలికారు ఆచార్యులవారు.

సత్యం మాష్టారుకి విసుగొస్తోంది.

'ఏవిటయ్యా! అవతల విందుప్రాణం పోతూ ఉంటే దేవుడూ దెయ్యమూ అంటారు. ఏవిటండీ ప్రెసిడెంటుగారూ .. '

'మన మేం చేస్తామయ్యా! అది ప్రజల ఆజ్ఞ. నేను ప్రజల మనిషిని. వాళ్ళు చెప్పినట్లు వినాల్సిందే.'

'వీల్లేదు ప్రెసిడెంటుగారూ, నేను చచ్చిపోనివ్వను వాణ్ని' అని లేవదీయబోయాడు. ఆచార్యులుగారు చటుక్కున లేచి జనాన్ని ఉద్దేశించి —

'చూశారా... ఈ నాస్తికుడు దేవుడికి ఎంత అపచారం తలపెడుతున్నాడో.., మీరంతా ఉత్సవం చూడాలని వచ్చారు....' అని ఇంకా ఏదో చెపుతుండగానే జనం సత్యం మాష్టారుని ఈడ్చుకుపోయారు.

భజనలు, కీర్తనలు జోరుగా సాగుతున్నాయి. పాము ఎలాగూ చిక్కలేదుకాబట్టి విగ్రహాన్ని చెరువులో స్నానం చేయించి గుడికి బయల్దేరతీశారు. అంతలో పాతికమందితో వచ్చాడు సత్యం మాష్టారు. అందరి చేతుల్లోనూ కత్తులూ - కర్రలూ వున్నాయి.

'ఈసారి మీరెవరైనా అడ్డొస్తే తల లెగిరిపోతాయి. ప్రెసిడెంటుగారూ మీరయినా అంతే.

ఈ హఠాత్పరిణామానికి అంతా భయపడిపోయారు. అంతా పక్కకి తప్పుకొని వాళ్ళకి దారిచ్చారు. వాళ్ళు రామన్నని మోసు కుని వెళ్ళిపోయారు. అప్పటికే అతని నెత్తురునిండా విషం కలిసి శరీరం నల్లగా అయిపోయింది. ఎంత ప్రయత్నించినా అతను బ్రతక లేదు.

రెండు రోజుల తర్వాత ఆంతరంగిక భద్రతా చట్టం క్రింద సత్యం మాష్టారునీ మరో అయిదుగుర్నీ అరెస్టు చేసి పట్నం తీసుకు పోయారు. సత్యంగారు పోలీసుల్ని తప్పించుకుని తిరుగుతోన్న విప్లవ వాది అట. అతన్ని పట్టుకోడానికి సహకరించిన ప్రెసిడెంటుగార్ని ప్రభుత్వం ఎంతగానో కొనియాడింది.

o o o

పాము ఏమైందీ ఇంతవరకూ ఎవరికీ తెలీదు. కానీ వేకువ గాలి వీచినా, ప్రెసిడెంటుగారి చెరువుమీద ఎండ పొడచూసినా ధ్వజస్థంభం మీది గంటలు గాత్రం విప్పినా, ఆలయ ప్రాంగణంలోని లోగిలిలో ఒంటినిండా బంగారంతో వారి సతీమణి మహాలక్ష్మిలా దర్శనం ఇచ్చినా, ఆచార్యులుగారికి పామే కన్పిస్తుంది. అప్పుడేకి మనసులో వినమ్రంగా మొక్కుకుంటారు పాముకి.

ప్రెసిడెంటు గారు ప్రెసిడెంటుగానే స్థిరపడిపోయారు. ఊళ్ళో బడీలేదు, ఊరవతలికి వంతెనా లేదు.

★